క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన పెంటమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబాన్ని మాజీ సర్పంచ్ స్రవంతి నవీన్‌కుమార్ శుక్రవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు రవిగౌడ్, గణేష్, సత్తయ్య, వెంకటేష్, నాగేష్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, నవీన్ పాల్గొన్నారు.

చండికాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండి గ్రామంలో కొలువైన చండికాంబ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం ఆలయ పూజారి అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

బీజేపీ స్వచ్ఛభారత్


శ్రమదానం చేస్తున్న నాయకులు

మెదక్‌జోన్: బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని మార్కెట్ కమిటీ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. అనంతరం దళితవాడలోని ఓ మహిళ ఇంటిలో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, బీజేపీ రాష్ట్రనాయకుడు, హైకోర్టు న్యాయవాది తాళ్లపల్లి రాజశేఖర్, నాయకులు నల్లాల విజయ్, ఎక్కలదేవి మధు, నాగరాజు, బక్కవారి శివ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కొల్చారంలో ఆత్మీయ సమ్మేళనం

కొల్చారం(నర్సాపూర్): ఈనెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం పోతంశెట్టిపల్లి చౌరస్తాలోని హనుమమ్మ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్టు ఆపార్టీ మండల అధ్యక్షుడు గౌరీ శంకర్‌గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

నేడు వరిగుంతంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరిగుంతం గ్రామంలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

'ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీకేజీ'

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ చేతగాని తనంతోనే పరీక్ష పేపర్ల లీకేజీ జరుగుతుందని.. దీనిని కప్పిపుచ్చుకునేందుకు బండి సంజయ్‌పై అక్రమంగా కేసు నమోదు చేశారని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ విమర్శించారు. శుక్రవారం కౌడిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. లిక్కర్ కేసును పక్కదారి పట్టించాలని చూస్తున్నారన్నారు. ధరణితో అక్రమాలకు పాల్పడుతూ వేలకోట్ల ఆస్తులు సంపాదించారని మండిపడ్డారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోడ రాజేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండల అధ్యక్షుడు రాకేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ బాల్‌రాజ్

రేగోడ్(మెదక్): మండలంలోని మర్పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గున్న సంగమేశ్వర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇన్‌చార్జి ఎస్ఐ బాల్‌రాజ్ శుక్రవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహం తీర్చడం కోసం ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లయ్య, నాయకులు నారాయణ, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసుల అందజేత

మెదక్ రూరల్: దివ్యాంగులకు రాయితీ బస్సు పాసులను శుక్రవారం హవేళిఘణాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్టీసీ అధికారులు అందజేశారు. వారికి అందజేస్తున్న బస్సుపాసులతో రాష్ట్రంలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో ప్రయాణించవచ్చని తెలిపారు.

నాలుగేళ్లుగా గుర్తింపేది?

- రాజకీయంలోకి వచ్చి అప్పులపాలయ్యాం
- పార్టీకి సేవ చేస్తే ఒక్కపని కాలేదు
- బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో కార్యకర్తల ఆవేదన



అల్లాదుర్గం(మెదక్): తెలంగాణ ఉద్యమంతో పాటు, టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి ఎంతో సేవ చేశాం.ఎన్నికలయి నాలుగేళ్లు దాటిన గుర్తింపే లేదు. కార్యకర్తలుగా, ఎంపీటీసీలుగా, సర్పంచ్‌లుగా ఎన్నికయిన పార్టీ నుంచి, ప్రభుత్వం నుంచి లాభం పొందకపోగా అప్పుల పాలయ్యమని, ఎమ్మెల్యే తమకు చేసింది ఏమీలేదని శుక్రవారం అల్లాదుర్గం ఎంపీపీ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి గృహంలో జరిగిన అందోల్ నియోజకవర్గం, అల్లాదుర్గం మండల ఆత్మీయ సన్నాహక సమావేశంలో కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశం వివరాలు కొందరు నేతలు సాక్షితో చెప్పారు. యువకులైన సర్పంచ్, ఎంపీటీసీలు తాము ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చామన్నారు. చేసిన పనులకు బిల్లులు రాక అప్పులపాలయామని వాపోయారు. పార్టీకి ఎంతో సేవ చేసినా తమకు నయాపైసా పని కాలేదన్నారు. ప్రతీ గ్రామం నుంచి కార్యాకర్తలు ఎమ్మెల్యేతో పనులు ఏమీ కాలేదని చెప్పడం గమనార్హం. తాను గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లను పెట్టించానని, ఎంతో మందికి పింఛన్‌లు ఇప్పించానని, ఇప్పుడు ఒక్కరికీ పింఛన్ ఇప్పించలేక పాయినట్లు ఓ మండల నేతనే ఆవేదన వ్యక్తం చేశారు. అల్లాదుర్గం ఎన్నో సమస్యలకు నిలయంగా మారిందని, అల్లాదుర్గం అభివృద్ధి ఏం జరిగిందని, సరైన రోడ్డు లేక మృతదేహాలను ఎత్తుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేసి ఉరి వేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ఎమ్మెల్యే గ్రామానికి ఎప్పుడొస్తున్నారో, సమస్యలు ఎక్కడ పరిష్కరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పరిశీలకులు జగన్‌మోహన్ రెడ్డి, పత్రి విఠల్, మల్లికార్జున్, శివశేఖర్, ఎంపీపీ అనిల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, మాజీ ఎంపీపీ కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత


ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని వైద్య ఖర్చుల కోసం మెదక్ ఎమ్మెల్యే ఎల్ఓసీని అందజేశారు. మెదక్ పట్టణం జమ్మికుంటకు చెందిన రజియాబేగం మనుమరాలు సనాఖనం బాసర ట్రిబుల్ ఐటీలో చదువుతోంది. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో ఆమెను హైదరాబాద్ మాదాపూర్‌లోని పేస్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యానికి దాదాపు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని హాస్పిటల్ యజమాన్యం తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో దిక్కుతోచని స్థితిలో రజియాబేగం కుటుంబీకులు మెదక్ కౌన్సిలర్లు రాగి వనజ అశోక్, మామిళ్ల ఆంజనేయులును ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ విషయాన్ని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పేస్ ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి వైద్యం అందించాలని ఆదేశించారు. శస్త్ర చికిత్సకు సంబంధించిన రూ.2,50,000 ఎల్ఓసీని ఎమ్మెల్యే మంజూరు చేయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్ ఆంజనేయులు, నాయకులు లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి


రోడ్డుపై బైఠాయించిన లబ్ధిదారులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో మిగిలిపోయిన రెండు పడకల ఇళ్లను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలనే డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు శుక్రవారం రామాయంపేటలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ మిగిలిన ఇళ్లను అసలైన లబ్ధిదారుకులకు కేటాయించాలన్నారు. ఇంటి వసతిలేక అద్దె ఇళ్లలో ఉంటున్న తమకు ఇల్లు కేటాయించాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు వారు మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి బస్టాండు ఎదుట రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. తమకు ఇళ్లు కేటాయించాలని పెద్ద ఎత్తున నినాదాలుచేశారు. ఆందోళనకారులకు ఎస్ఐ రంజిత్ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. సుమారు గంటకుపైగా చేసిన రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఆందోళనలో పార్టీ నాయకులు కొడపర్తి నరేందర్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అంబేడ్కర్ యూత్ సభ్యులు


యూత్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా రామాయంపేటలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ యూత్ క్లబ్ సభ్యులు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిశారు. కాంస్య విగ్రహాన్ని ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సరాపు యాదగిరి, క్లబ్ యూత్ డైరెక్టర్ గావు సురేందర్ ఉన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం పూర్తి

గజ్వేల్‌రూరల్: రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో తలపెట్టిన హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం పూర్తయినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని కేసరి హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామరాజు మాట్లాడుతూ లోకకల్యాణార్థం హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞంను తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేసరి హనుమాన్ దేవాలయ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, పిచ్చయ్య, శ్రీనివాస్, జయసింహరావు, రమేష్, బాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు స్థానం లేదు

దుబ్బాకటౌన్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తెలంగాణలో ఆ పార్టీలకు స్థానంలేదని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు.శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట, నార్సింగ్, దౌల్తాబాద్, రాయపోల్ మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన 60 మంది కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల కృషితో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

వైభవంగా బోనాలు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కుర్తివాడలో శుక్రవారం మత్తడి పోచమ్మ జాతరలో భాగంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై మహిళలతో కలసి బోనమెత్తుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్రవంతి, బీఆర్ఎస్ నాయకులు కిష్టాగౌడ్, ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బెజుగం శంకర్, తదితరులు పాల్గొన్నారు.


బోనంతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

భేతాళ స్వామి జాతర ప్రారంభం

పోలేరమ్మకు బోనాలు, రథోత్సవం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం భేతాళ స్వామి జాతర శుక్రవారం ప్రారంభమైంది. తొలి రోజు పోలేరమ్మ దేవతకు మహిళలు బోనాలు సమర్పించి, రథోత్సవం నిర్వహించారు. రథాన్ని రంగు రంగు లైట్లతో అలంకరించి గ్రామ వీధులగుండా ఊరేగించి, పోలేరమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పోలేరమ్మ దేవతకు మొక్కులు తీర్చుకుని భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతరలో భాగంగా శనివారం పోచమ్మ దేవతకు బోనాలు సమర్పించనున్నారు.


రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో కాయతిస్వామి పేరిట మంజూరైన రూ.60వేల చెక్కును సర్పంచ్ కందూరి కనుకవ్వ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు కందూరి ఐలయ్య శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మేర్గొజు కరుణాకర్‌చారి, కనుగుల చంద్రం, కంకణాల మల్లేశం, పత్తిరి రాము, స్వామి, ప్రదీప్, మైపాల రహీం పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

తూప్రాన్: పట్టణంలోని రామాలయంలో వద్ద శుక్రవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పల్లకీలో ఊరేగింపుగా హల్దీవాగుకు తీసుకెళ్లారు. మంత్రోత్సవాల మధ్య చక్రస్నానం నిర్వహించారు. అనంతరం రథంపై సీతారాముల విగ్రహాలను ఉంచి ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రథంపై నుంచి మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ ప్రసాదం పంచి పెట్టారు.



బీఆర్ఎస్ బూత్ కమిటీల ఎన్నిక

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేట, ఘనపురం గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్ కమిటీలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డిపేట బూత్ కమిటీ అధ్యక్షులుగా కనికి బయన్న, భాస్కర్, మన్నె కనకరాజు, సోషల్ మీడియా కన్వీనర్లుగా బుర్ర ఎల్లాగౌడ్, మన్నె బాలరాజు, ఘనపూర్ బూత్ అధ్యక్షులుగా మరుపల్లి మల్లేశంగౌడ్, యాటెల్లి గణేష్, సోషల్ మీడియా కన్వీనర్లుగా చెన్నారెడ్డి, రాజిరెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, వెంకటమ్మ, ఎంపీటీసీ స్వామి, రైతుబంధు మండల అధ్యక్షుడు కనకయ్య, ఎఎంసీ డైరెక్టర్లు నరేందర్‌గౌడ్, కిషన్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ పోచయ్య, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు జెడ్పీటీసీ విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి రత్నపూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఎర్పాటు కోసం జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా రూ.20 వేలు విరాళం శుక్రవారం నిర్వాహకులకు అందజేశారు. అంబేడ్కర్ విగ్రహం ఎర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకులను అభినందించారు. విగ్రహం వద్ద ఎల్ఈడీ లైట్లు ఎర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. శివ్వంపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బిక్షపతి తల్లి మృతి చెందడంతో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన పిట్ల నరేందర్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని చికిత్స నిమిత్తం రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. శభాష్‌పల్లి, దంతన్‌పల్లి గ్రామ పంచాయతీలకు ఉత్తమ అవార్డులు సాధించడం పట్ల సర్పంచ్‌లను పార్వతి సత్యం, దుర్గేష్‌లను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, అశోక్, కొండల్, దావుద్, ఖాదీర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

కేంద్రంపై దుష్ప్రచారం తగదు


మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌గౌడ్

నర్సాపూర్: రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇస్తున్నప్పటికీ ఇవ్వడం లేదని రాష్ట్ర మంత్రులు దుష్ప్రచారం చేయడం తగదని బీజేపీ నియోజవకర్గ కన్వీనర్ మల్లేష్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రహదారులు నిర్మించేందుకు, గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం నిధులు ఇస్తుందని తెలిపారు. బీజేపీ రాష్ట్రంలో బలపడడంతో రాజకీయంగా ఎదుర్కొలేక బండి సంజయ్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని.. రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కాగా నేటి ప్రధాని మోదీ సభకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రూరల్ ఇన్‌చార్జ్ బాల్‌రెడ్డి, నాయకులు నాగరాజు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మాజీ డిప్యూటీ సీఎం దామోదర


ఇఫ్తార్ విందులో మాజీ డిప్యూటీ సీఎం దామోదర

రేగోడ్(మెదక్): రేగోడ్ మాజీ సర్పంచ్ మన్నె విజయభాస్కర్ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావ్, జెడ్పీటీసీ యాదగిరి, కో–ఆప్షన్ సభ్యుడు చోటుమియా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, మాజీ సర్పంచ్ ఎం.విజయభాస్కర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి, డైరెక్టర్ నాగేందర్ రావు కులకర్ణి, పార్టీ గ్రామ అధ్యక్షుడు శణకరప్ప తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక


ప్రార్థన చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

చేగుంట(తూప్రాన్): మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ జరుపుకుంటామని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు. ఎంపీతో కలిసి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, నాయకుడు విశ్వేశ్వర్‌రావు, ముస్లిం మత పెద్దలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వాటర్ కూలర్ ఏర్పాటు


వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): వేసవి సందర్భంగా ప్రయాణికుల కోసం బస్టాండ్‌లో వాటర్ కూలర్ ఏర్పాటు చేసినట్టు టీఎస్ఆర్టీసీ మెదక్ డిపో అసిస్టెంట్ మెకానిక్ ఫోర్‌మెన్ తిరుమలేష్ తెలిపారు. శుక్రవారం బస్టాండ్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఉచితంగా చల్లని తాగు నీటిని అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు రమేష్, మాటూరి శాఖయ్య, శ్రీనివాస్, గ్రామస్తులు పుండరీకంగౌడ్, శివరాజ్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నర్సాపూర్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని సీఎస్ఐ వెస్లి చర్చిలో ప్రత్యేక పూజలు చేశారు. చర్చి ఫాదర్ రెవరెండ్ ధారా సందీప్ ఆధ్వర్యంలో భక్తులు ప్రార్థనలు చేశారు. చర్చి కమిటీ సభ్యులు, భక్తులు ఆరాధనలో పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం పేటలోని సీఎస్ఐ చర్చితో పాటు ఆయా గ్రామాల్లో చర్చిలలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ దేవవరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ శాంతిని పాటిస్తూ క్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కౌడిపల్లిలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రమేశ్ భక్తులకు దైవ సందేశం ఇచ్చారు.


కౌడిపల్లి సీఎస్ఐ చర్చిలో..


నర్సాపూర్: ప్రార్థనలో భక్తులు


పేటలోని సీఎస్ఐ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు